TGTEL/26A6221

# తొలివెలుగు

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 03 | శుక్రవారం | 31-7-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:03 | Friday | 31-7-2026 | Pages:08 | Cost:2/- |


విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## బాధితుల్ని గాలికొదిలేసి.. నిందితుడి కుటుంబానికి పరామర్శనా?

- హిట్ అండ్ రన్ కేసులో జగన్ తీరుపై మంత్రి లోకేష్ ఆగ్రహం
- శ్రీకాకుళం పర్యటనలో మాజీ మంత్రి అప్పలరాజు కుటుంబాన్ని కలిసిన జగన్
- ఇది పరామర్శ కాదు, నేరస్థ మనస్తత్వానికి పరాకాష్ట అని లోకేష్ ట్వీట్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులో బాధితుడి కుటుంబాన్ని విస్మరించి

- మిగతా 2వ పేజీలో

# ప్రమాదాన్ని హత్యగా మార్చేస్తారా?

- చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలు
- నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- సీదిరి అప్పలరాజు కుటుంబంపై ప్రభుత్వం కుట్రలు
- రోడ్డు ప్రమాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం హేయం
- టీడీపీ నేతల ప్రమాదాల్లోనూ ఇదే విధంగా వ్యవహరించారా?
- చంద్రబాబుకు యాదవులంటే ప్రేమ లేదు.. బీసీలంటేనే చులకన
- సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ లేదు.. పథకాలన్నీ రద్దు



శ్రీకాకుళం : అనుకోని పరిస్థితుల్లో దురదృష్టవశాత్తు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేస్తే, దాన్ని హత్య కేసుగా మార్చడం అత్యంత హేయమని, చంద్రబాబు దిగజారిన దారుణ రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఆ కేసులో మాజీ మంత్రి అప్పలరాజును ఇరికించి జైలుకు పంపడం ఆ కుటుంబంపై చంద్రబాబు కూటమి ప్రభుత్వ కుట్రను తేటతెల్లం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు చేసిన రోడ్డు ప్రమాదాల్లో కూడా ఇలాగే వ్యవహరించారా.. అని సూటిగా ప్రశ్నించారు. అప్పలరాజు కుటుంబానికి పార్టీ పరంగా పూర్తి అండగా ఉంటామని, ఈ కేసులో న్యాయమే గెలుస్తుందని చెప్పారు. ఈ ప్రభుత్వంపై ఇంకా గట్టిగా పోరాడతామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా అంపోలు వద్ద జిల్లా జైలులో

- మిగతా 2వ పేజీలో



## తిరుమల భక్తులకు బిగ్ అలర్ట్

సర్వదర్శనానికి ఎన్ని గంటల సమయం పడుతుందంటే..!

- తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ
- శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 74,471 మంది భక్తులు
- ఒక్కరోజే రూ.4.68 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

2లో



## లోక్‌సభలో మళ్లీ రగడ


- విద్యార్థులపై పోలీసుల దాష్టీకం, రామాలయ విరాళాల చోరీపై విపక్షాల ఆందోళన
- హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని విపక్షాల పట్టు
- గందరగోళం మధ్యే 'వందేమాతరం' బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ: గత రెండ్రోజులుగా కాస్తంత ప్రశాంత వాతావరణం కన్పించిన పార్లమెంట్‌లో గురువారం మళ్లీ విపక్షాల నిరసనహోరు మొదలైంది. చలో సంసద్ ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై పోలీసుల కర్కశ చర్య, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఆరోపణలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభలో నిరసన వ్యక్తం చేయడంతో సభా కార్యక్రమాలు దాదాపు స్తంభించాయి. పలుమార్లు వాయిదాలు పడ్డ సభలో తీవ్ర గందరగోళం మధ్యే ప్రభుత్వం జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) (వందేమాతరం) బిల్లును ఆమోదించింది. బుధవారం ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ సహా ఇండియా కూటమికి చెందిన ఎంపీలు తమ స్థానాల్లో నిలబడి నినాదాలు చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసు అతి చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని, ఆ అంశంపై వెంటనే చర్చకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

- మిగతా 2వ పేజీలో

# '2034 వరకు నేనే సీఎం'

- పనితీరు కనబరిచినందుకు రాజీనామా చేయాలా?
- విద్యాశాఖ మంత్రిగా రేవంత్ వైదొలగాలని కొందరు అంటున్నారు
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా?
- టీచర్ల నియామకం, పదోన్నతులు సక్రమంగా నిర్వహించినందుకా?
- ఫిన్‌లాండ్, జర్మనీలో పర్యటించిన టీచర్లతో ముఖాముఖిలో సీఎం రేవంత్‌రెడ్డి
- 2034 వరకు ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని వెల్లడి




హైదరాబాద్: 'విద్యాశాఖ మంత్రిగా రేవంత్‌రెడ్డి వైదొలగాలని కొందరు మాట్లాడుతున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచినందుకు విద్యాశాఖకు రాజీనామా చేయాలా? నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా? టీచర్ల నియామకం, పదోన్నతులు సక్రమంగా నిర్వహించినందుకా? ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చినందుకా? విద్యార్థులకు నైపుణ్యం అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ వర్సిటీ బోర్డు సభ్యులుగా నియమించినందుకా' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫిన్‌లాండ్, జర్మనీలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులతో ముఖాముఖి సందర్భంగా గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2034 వరకు ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. 80 వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూళేశ్వరం అయిందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలు అందుతున్నాయని సీఎం

- మిగతా 2వ పేజీలో

## ఐదు రోజుల పోరాటం విఫలం.. పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

- బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి
- గుండెపోటుతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అస్తమయం
- ఐదు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉన్నా ఫలించని చికిత్స
- 2018లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సుదర్శన్‌రెడ్డి
- సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన నేత



2లో

## పోలీసు కస్టడీకి సీఐ నాగరాజు

- 24 గంటలు విచారణ చేయడానికి వీల్లేదు
- జైలు నిబంధనల ప్రకారమే చేయాలి
- నాగరాజు తరపు న్యాయవాది వాదన

2లో

## అబద్ధానికి చొక్కా, ప్యాంటు వేస్తే చంద్రబాబే

- ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో కాకాణి విమర్శలు
- ఏ మొహం పెట్టుకుని ప్రజల వద్దకు వెళతారని ప్రశ్న
- డీఎస్సీ అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్



## మెండుగా వానలు.. నిండుగా ప్రాజెక్టులు!

- జూరాల నుంచి శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ
- ఎగువ గోదావరిలోనూ వరద ఉధృతి.. శ్రీరాంసాగర్‌కు భారీ ప్రవాహం
- పోటెత్తిన కడెం, ప్రాణహిత, ఇంద్రావతి
- కడెం గేట్లు ఎత్తివేత.. ఎల్లంపల్లి, మేడిగడ్డ, సమ్మక్క, సీతమ్మసాగర్‌కు భారీ వరద
- నేడు భద్రాచలం వద్ద 10 లక్షల క్యూసెక్కులకు చేరనున్న వరద ప్రవాహం

మంచిర్యాలరూరల్: బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది..గలగలా గోదావరి పరుగులు పెడుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరపి లేని వర్షాలతో కృష్ణా, గోదావరి నదులు వరదెత్తాయి. శ్రీశైలం ప్రాజెక్టు వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. దీంతో ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది.



2లో

## అబద్ధానికి చొక్కా, ప్యాంటు వేస్తే చంద్రబాబే

తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమంపై వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదేళ్లలో ఏమీ సాధించకుండా టీడీపీ నేతలు ఏ మొహం పెట్టుకుని ప్రజల వద్దకు వెళ్తారని ఆయన ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు ప్రజలకు తమ ముఖం కూడా చూపించలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ' వంటి హామీల అమలులో ప్రభుత్వం కోతలు పెడుతోందని విమర్శించిన కాకాణి, "అబద్ధానికి చొక్కా, ప్యాంటు వేస్తే అది సీఎం చంద్రబాబునే" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్ పూర్తిగా భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. డీఎస్సీ నిర్వహణలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని కాకాణి డిమాండ్ చేశారు. అభ్యర్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు జరిగిన అన్యాయంపై పేపర్లు పట్టుకుని రోడ్లపై తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి లోకేశ్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ చదువులపై సెటైర్లు వేస్తూ... స్విమ్మింగ్ పూల్‌లో ఆయన చదివిన తీరు అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. డీఎస్సీ అక్రమాలపై జగన్‌కు సవాళ్లు విసరడం మాని, బాధితులకు సమాధానం చెప్పాలని, లేకపోతే మౌనంగా కూర్చోవాలని అన్నారు.

## పోలీసు కస్టడీకి సీఐ నాగరాజు

విజయవాడ లీగల్: దేశవ్యాప్తంగా సంచలనం సష్టించిన కాపు యువకుడు గాదె సాయికష్ణ అదశ్యం కేసులో సస్పెండ్ అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న విజయవాడ కష్ణలంక సీఐ నాగరాజును పోలీసు కస్టడీకి విజయవాడ నాలుగో అడిషనల్ జూనియర్ సివిల్ కమ్ ఆర్‌సీసీ కోర్టు అనుమతించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో గురువారం విజయవాడ న్యాయస్థానంలో పోలీసులు ఆయన్ను హాజరుపరిచారు. ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య కోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. నాగరాజు తరఫున న్యాయవాది జి. సాంబశివరావు వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జైలు మాన్యువల్ నిబంధనలకు లోబడి పోలీసుల విచారణ ఉ.10 నుంచి సా.5 వరకు మాత్రమే జరపాలన్నారు. విచారణ పేరుతో రాత్రి వేళల్లో సుదీర్ఘ ఇంటరాగేషన్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతిలేదని, 24 గంటల పాటు నిందితులను ఇంటరాగేషన్ చేయడం ముమ్మాటికీ చట్టవిరుద్ధమన్నారు. అలాగే, ఈ కేసుకు సంబంధించి విచారణ జరిగే సమయంలో నిందితుడి తరఫు న్యాయవాది పందిరి బాబూరావు లేదా వేరొక న్యాయవాదిగానీ హాజరుకావచ్చన్నారు. అయితే, న్యాయవాది విచారణలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోకూడదని ఆంక్షలు విధించిందని కోర్టు తీర్పును చదివి వినిపించారు. లాయర్ విచారణ ప్రదేశానికి కనీసం 10 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉండాలని ట్రయల్ కోర్టు తీర్పులో ఉందన్నారు. సుప్రీంకోర్టు కూడా ట్రయల్ కోర్టు, హైకోర్టుల ప్రధాన నిబంధనలను సమర్థిస్తూనే కొన్ని సవరణలు చేసిందని.. విచారణ మొత్తం జైలు మాన్యువల్, కోర్టు నిబంధనల పరిధిలోనే సాగాలని డిఫెన్స్ న్యాయవాదులు వాదించారు. విచారణకు వచ్చేముందు పోలీసు అధికారులు సమయం, ఇతర వివరాలను ముందుగా నిందితుడి తరఫు న్యాయవాదులకు తెలియజేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సత్యవాణి వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఉత్తర్వుల ప్రకారమే విచారణాధికారులు విచారిస్తారని, అలాగే నిందితునికి సిట్ కార్యాలయంలో సీసీ కెమేరాల పర్యవేక్షణలో భారీ భద్రత మధ్య రూమ్‌ను కేటాయించనున్నట్లు న్యాయమూర్తి దష్టికి తెచ్చారు. ఇరువురి వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి రిషీక్ విచారణ సమయంలో విచారణాధికారుల నుండి ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తెలియజేయాలని సూచిస్తూ నాగరాజును పోలీసు కస్టడీకి అనుమతించారు.

## లోక్‌సభలో మళ్లీ రగడ

(మొదటి పేజీ తరువాయి)

అయోధ్య రామాలయంలో కోట్ల కొలదీ విరాళాలు చోరీ అయిన ఉదంతంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సమాజ్‌వాదీ పార్టీ సహా విపక్ష పార్టీల సభ్యులు పట్టుబట్టాయి. దీంతో సభ ప్రారంభమైన కొద్దిసేపటికే స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమయ్యాక వివిధ శాఖలకు సంబంధించిన మంత్రులు పార్లమెంటరీ పత్రాలు సభ ముందుంచిన తర్వాత విపక్ష సభ్యులు తిరిగి నినాదాలు కొనసాగించారు. దీంతో సభను 3:30 గంటల వరకు వాయిదా వేశారు. యోధ్య రామాలయంలో భారీ స్థాయిలో విరాళాలు చోరీకి గురైన ఘటనపై మకరద్వారం ముందు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఒక విరాళాల పెట్టెను ఏర్పాటు చేసి అందులో కరెన్సీ నోట్లను విరాళమిస్తూ నిరసన వ్యక్తం చేశారు. 'చందా చోరులారా..గద్దె వీడండి'అంటూ ప్లకార్డులు, నినాదాలతో ఆందోళన కొనసాగించారు. మంత్రి అమిత్ షా సభకు హాజరై ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. 'అమిత్ షా ఇంకా ఎంతకాలం ప్రజలకు సమాధానం చెప్పకుండా దాక్కుంటారు?. ఆయన పార్లమెంట్‌లో ఎందుకు కనిపించడం లేదు?'అని విపక్ష నేతలు ప్రశ్నించారు. ధ్యాహ్నం 3.30 గంటల తర్వాత లోక్‌సభ తిరిగి సమావేశమయ్యాక జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు-- 2026ను ప్రవేశపెట్టారు. జాతీయ గేయం వందేమాతరంను కించపరిచినా, గేయాన్ని పాడే సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకపరిచినా, మరే విధంగా గేయం పవిత్రత, ప్రతిష్టను మంటగలిపేలా దుస్సాహసం చేసినా ఆ చర్యలన్నింటినీ ఇకపై తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తూ శిక్షలు విధించేలా జాతీయ గేయంపై బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతం జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను జాతీయ గేయం వందేమాతరానికి కల్పించే ఉద్దేశ్యంతోనే ఈ బిల్లును తెచ్చినట్లు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. వెంటనే డీఎంకే సభ్యురాలు కె కనిమొళి లేచి నిలబడి అభ్యంతరం వ్యక్తంచేశారు. "జాతీయవాదం ముసుగులో హిందుత్వ ఎజెండాను మోదీ సర్కార్ ముందుకు తెస్తోంది. ఇది సమాఖ్య విధానానికి పూర్తిగా వ్యతిరేకం. జాతీయవాదాన్ని బలవంతంగా రుద్దకూడదు.

## తిరుమల భక్తులకు బిగ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో తిరుమల గిరులు భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోవడంతో, టోకెన్లు లేని భక్తులు వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్నారు. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. వారికి నిరంతరాయంగా పాలు, తాగునీరు, అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. బుధవారం ఒక్కరోజే స్వామివారిని 74,471 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 31,319 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# ప్రమాదాన్ని హత్యగా మార్చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు గురువారం ఆయన ఇక్కడకు వచ్చారు. అక్కడే ఉన్న అప్పలరాజు భార్య, ఇద్దరు కుమారులను ఓదార్చారు. అప్పలరాజుకు న్యాయం జరుగుతుందని, న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, ఆయన త్వరలోనే బయటకు వస్తారని వారికి ధైర్యం చెప్పారు. 'ఒక ఘటనను ఏ మాదిరిగా ట్విస్ట్ చేస్తున్నారో చూడండి. కనీసం మానవతా విలువలు లేకుండా, మంచితనం అన్నదానికి పూర్తిగా పాతర వేస్తూ, ఈ పిల్లాడిపై కుట్ర చేశారు. తనకు కేవలం 18 ఏళ్లు. ఒక నెల కిందట 'నీట్' పరీక్ష రాశాడు. వాళ్ల నాన్న మాదిరిగా తాను కూడా ఒక మంచి డాక్టర్ కావాలని ఆరాట పడుతున్నాడు. పొరపాటున ఓ యాక్సిడెంట్ జరిగితే, దానిని ట్విస్ట్ చేసి.. అందులో కుట్ర కోణం యాడ్ చేసి, హత్య చేశాడని కేసు పెట్టారు. హత్యాయత్నం నుంచి హత్య చేశాడని కేసును ట్విస్ట్ చేశారు. అలా అప్పలరాజు కుటుంబాన్ని వేధించడం ఎంత వరకు ధర్మం? సమాజంలో ప్రతి ఒక్కరు దీనిపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. యాక్సిడెంట్ అనేది ఉద్దేశ పూర్వకంగా చేసేది కాదు. 45 ఏళ్ల గొర్రెల కాపరి రోడ్డు మీద గొర్రెలను తోలుకుంటూ పోతుండగా బైక్ యాక్సిడెంట్ జరిగింది. ఇందులో కుట్ర కోణం ఎక్కడి నుంచి వచ్చింది? ఇది హత్య అవుతుందా? ఈ పిల్లాడికి ఆ మనిషి ఎవరో కనీస పరిచయం కూడా లేదు. అతడు పాదచారి మాత్రమే. దురదృష్టవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదాన్ని పట్టుకుని, ఈ పిల్లాడి జీవితం నాశనం చేయాలన్న ఆలోచన చేయడం ఎంత వరకు ధర్మం? ఇది కరెక్టేనా? అప్పలరాజు బీసీల్లో ఒక మంచి నాయకుడు కాబట్టి, ఆయన వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకుడు కాబట్టి ఇలా వేధిస్తున్నారు. నిజంగా, ఒక పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను ఒక కుట్రగా, హత్యగా చిత్రీకరించి.. అప్పలరాజు కుటుంబాన్ని కేసులో ఇరికించే ప్రయత్నం చేయడం ఎంత మటుకు ధర్మం అనేది అందరూ ఆలోచించాలి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి అంటే.. ఎల్లో మీడియాలో ఒక కట్టుకథ రాయిస్తారు. దానికి యాంగిల్స్, వక్రీకరణ, ట్విస్టింగ్, మసాలాలు అన్నీ కలిపి, తర్వాత టీడీపీ సోషల్ మీడియా దాన్ని అందుకుంటుంది. దాన్ని చివరకు పోలీసులు కేసుగా మార్చేస్తారు. ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ ఫైవ్, ఒక చంద్రబాబు, ఓ లోకేశ్, వీళ్లకి సంబంధించిన గవర్నమెంట్, వీళ్లకి సంబంధించిన పోలీసులు.. ఇదొక మాఫియా సామ్రాజ్యం. అప్పలరాజు 10వ తరగతిలో రాష్ట్రంలోనే ఫస్ట్ ర్యాంకర్. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అవార్డు కూడా ఇచ్చాడు. చదువుల్లో ఆ స్థాయికి పోయిన వ్యక్తి.. తన సొంత కష్టం మీద డాక్టర్ అయ్యాడు. లోకేశ్ మాదిరి డొనేషన్ కట్టి స్టాన్‌ఫోర్డ్‌లో సీటు తెచ్చుకోలేదు. ఎండీ కూడా చేశాడు. అంటే మెడిసిన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్. ఒక మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. తర్వాత వైఎస్సార్‌సీపీ తరఫున టికెట్ ఇస్తే, ప్రజల ఆశీర్వాదాలతో ఎమ్మెల్యే అయ్యాడు. మంత్రిగా కూడా పని చేశాడు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి ఇంతగా ఎదిగిన ఆయన వ్యక్తిత్వ హననం కోసం, ఒక తప్పుడు కేసు పెట్టారు. ఒక యాక్సిడెంట్‌ను కుట్రగా, హత్యగా వక్రీకరించారు. ఆయన కెరీర్‌ను నాశనం చేయాలన్న దుర్మార్గపు ఆలోచన. ఆ దుర్మార్గపు ఆలోచనల్లో కనీసం ఈ 18 ఏళ్ల పిల్లోడి జీవితం నాశనం అవుతుందని కూడా చంద్రబాబు ఆలోచించ లేదు. 80 ఏళ్ల వయసు వస్తోన్న ఈ మనిషి అన్నం తింటున్నాడా? లేక గడ్డి తింటున్నాడా? అని అడుగుతున్నా. ఇది రాజకీయాలను ఒక నీచమైన స్థాయికి తీసుకుపోవడం. ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం ఉంటుందా? తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వాళ్లు ఎవరైనా యాక్సిడెంట్ చేస్తే.. వాళ్ల పిల్లలు కానీ, వారి బంధువులు కానీ యాక్సిడెంట్ చేస్తే, వాళ్లు కారులో ఉండగానే యాక్సిడెంట్ జరిగితే.. మొత్తం కుటుంబంపై ఇదే మాదిరిగా కేసులు పెట్టి, అరెస్టులు చేసి, కుట్ర కోణం, హత్య కోణం అని చెబుతారా? అని చంద్రబాబును అడుగుతున్నా.

## బాధితుల్ని గాలికొదిలేసి.. నిందితుడి కుటుంబానికి పరామర్శనా?

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడి కుటుంబ సభ్యులను పరామర్శించడంపై ఆయన మండిపడ్డారు. ఇది పరామర్శ కాదని, నేరపూరిత మనస్తత్వానికి పరాకాష్ట అని లోకేష్ 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. విచక్షణ ఉన్న ఏ నాయకుడైనా రోడ్డు ప్రమాదంలో మరణించిన బీసీ సామాజిక వర్గానికి చెందిన గొర్రెల కాపరి డి. దానయ్య కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలుస్తారని, అయితే జగన్ మాత్రం బాధితులను వదిలి నిందితుల పక్షాన నిలిచారని లోకేష్ విమర్శించారు. గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన జగన్ మోహన్ రెడ్డి, హిట్ అండ్ రన్ కేసులో సాక్ష్యాలు తారుమారు చేశారన్న ఆరోపణలతో జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కలిసేందుకు వెళ్లారు. అయితే, ఆయన సాయంత్రం 5 గంటల తర్వాత చేరుకోవడంతో జైలు అధికారులు అనుమతించలేదు. దీంతో జైలు వెలుపల అప్పలరాజు కుటుంబ సభ్యులను కలిసి జగన్ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక సాధారణ ప్రమాద ఘటనను హత్య కేసుగా చిత్రీకరిస్తూ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. జగన్ చర్యలపై లోకేష్ తీవ్రంగా స్పందిస్తూ, "మనస్సాక్షి ఉన్న ఏ నాయకుడైనా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బీసీ సోదరుడు దానయ్య గారి కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలుస్తారు. కానీ హిట్ అండ్ రన్ కేసులో ఒక నిండు ప్రాణం బలైన ఘటనలో మృతుని కుటుంబాన్ని విస్మరించి, నిందితుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన జగన్ రెడ్డి తీరు అమానవీయ ప్రవర్తనకు నిదర్శనం.

## ఐదు రోజుల పోరాటం విఫలం.. పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (52) కన్నుమూశారు. గత ఐదు రోజులుగా గుండెపోటుతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం అర్ధరాత్రి 12.50 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు అధికారికంగా ప్రకటించారు. ఆయన మరణవార్తతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో, నర్సంపేట నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 26న హనుమకొండలోని తన నివాసంలో ఉన్న సుదర్శన్‌రెడ్డికి ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు వైద్యులు గుర్తించారు. సుమారు గంట పాటు శ్రమించి, తొమ్మిది సార్లు సీపీఆర్ చేసిన తర్వాత ఆయన గుండె తిరిగి స్పందించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం వెంటనే సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రత్యేక వైద్య బృందం ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారంభించింది. అయితే, సుదీర్ఘకాలం స్పృహలోకి రాకపోవడంతో నాడీ సంబంధిత స్పందన కనిపించలేదు. ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం కారణంగా మెదడుకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఈసీజీ, బ్రెయిన్ ఎంఆర్‌ఐ పరీక్షల్లో తేలిందని వైద్యులు తెలిపారు. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడిన ఆయన చివరకు కన్నుమూశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో 1974 ఆగస్టు 6న ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్‌రెడ్డి, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు.

## మెండుగా వానలు.. నిండుగా ప్రాజెక్టులు!

(మొదటి పేజీ తరువాయి)

గురువారం ఉదయం 6 గంటలకు జలాశయానికి 30,194 క్యూసెక్కుల వరద రాగా, సాయంత్రం 6 గంటల వరకు 89,240 క్యూసెక్కులకు పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 827.26 అడుగులకు చేరగా నిల్వలు 46.82 టీఎంసీలకు పెరిగాయి. ప్రాజెక్టు నిండాలంటే మరో 168 టీఎంసీల నీరు అవసరం. పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కొనసాగుతుండటంతో కృష్ణా ప్రధాన పాయ నుంచి కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 82,111 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 1.1లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలుతున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.1 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 1.11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలోని ఉజ్జయినీ జలాశయానికి 33,803 క్యూసెక్కుల వరద వస్తుండగా, 31,600 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో పైమూడు జలాశయాలకు దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టుకు 94,733 క్యూసెక్కుల వరద పోటెత్తింది. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, 7.66 టీఎంసీల నీటిని నిల్వ చేస్తూ 85,421 క్యూసెక్కుల నీటిని 12 గేట్లు, విద్యుత్ కేంద్రం ద్వారా దిగువ వదులుతున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో నిలకడక వరద కొనసాగుతోంది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లోకి 14,922 క్యూసెక్కుల నీరు చేరుతుండగా..గరిష్ట నిల్వ సామర్థ్యం 105.79 టీఎంసీలకుగాను 36.04 టీఎంసీలకు నిల్వలు చేరాయి. జూరాల నుంచి విడుదల చేస్తున్న వరద శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండడంతో నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. దిగువన ఉన్న నాగార్జునసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 136.99 టీఎంసీల నిల్వలున్నాయి. మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఎగువ గోదావరిలో క్రమంగా వరద పెరుగుతోంది. దిగువ పరీవాహకంలోని ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారం వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకల్లో వరద ఉధృతమవుతోంది. గోదావరిపై మహారాష్ట్రలో ఉన్న జైక్వాడి ప్రాజెక్టులోకి 33,328 క్యూసెక్కుల వరద చేరుతుండడంతో గరిష్ట సామర్థ్యం 102.73 టీఎంసీలకు గాను 79.79 టీఎంసీలకు నిల్వలు పెరిగాయి. ఉపనది సింగూరులో వరద ప్రారంభం కాకపోవడంతో రాష్ట్రంలోని సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఇంకా వరద ప్రారంభం కాలేదు. ఎగువ గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 75,432 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో 80.5 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గానూ 21.51 టీఎంసీలకు నిల్వలు చేరాయి. మరో ఉపనది కడెంపై ఉన్న కడెం ప్రాజెక్టుకు 1.44 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో 4.7 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గాను 1.91 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 16 గేట్లు ఎత్తడం ద్వారా 1.48 లక్షల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం నుంచి 1.56 లక్షల క్యూసెక్కులు, గోదావరి నుంచి 2.07 లక్షల క్యూసెక్కులు కలిపి మొత్తం 3.63 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 20.18 టీఎంసీల గరిష్ట నిల్వ సామరాథ్యనికి గాను 19.09 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ నంది పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు.

# '2034 వరకు నేనే సీఎం'

(మొదటి పేజీ తరువాయి)

ంవంత్ అన్నారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తెచ్చాం . విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందిస్తున్నాం . పిల్లలు తల్లిదండ్రులకు స్టైస్ బస్టర్స్ం. అందుకే డే స్కాలర్ విద్యార్థులకు కూడా బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందిస్తున్నాం . సమాజంలో మానవ సంబంధాలు విచ్?ఛన్నమైతే ఏ కుటుంబం, ఏ దేశం నిలబడదు. తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయుల దగ్గరే పిల్లలు ఎక్కువ సమయం ఉంటారు. తల్లిదండ్రులకు ఎంత బాధ్యత ఉంటుందో ఉపాధ్యాయులకూ అంతే బాధ్యత ఉంది . విద్యార్థుల కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇక నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లతో సమానంగా ఏటా 10--15 మంది టీచర్లను విదేశాలకు పంపి చదువుకునేందుకు అవకాశం కల్పిద్దాం. ఓట్లు, రాజకీయం కోసం నేను పనులు చేయడం లేదు. నాణ్యమైన విద్యను అందించాలనే బాధ్యతతో పనిచేసుకుంటూ వెళ్తున్నా. నా సంకల్పాన్ని మీరు ముందుకు తీసుకెళ్లేందుకు ఇక్కడి నుంచే దీక్ష తీసుకుని బయలుదేరండి' అని ఉపాధ్యాయులకు చెప్పారు. ఇంగ్లిష్ ఒక్కటే ముఖ్యమనుకుంటే చైనా ప్రపంచాన్ని ఎలా శాసిస్తోంది? 25 ఏళ్లు అమెరికా వైపు చూశాం.ం ఇప్పుడు ఫోకస్ పెట్టాల్సింది జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి దేశాలపై . ఆ దేశాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి . ప్రపంచ దేశాలు మనవైపు చూసేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుదాం . ఉపాధ్యాయ సంఘాలు మీ సమస్యలపై కాదు.. విద్యార్థుల సమస్యలపై కొట్లాడాలి. ఐదేళ్లు సమాజం కోసం, తరతరాల భవిష్యత్‌ను మార్చేందుకు ప్రతిజ్ఞ పూనండి . నాణ్యమైన విద్య అందించేందుకు ఇంకా ఏం చేయాలో మీరే సూచించండి . వచ్చే విద్యా సంవత్సరానికి ఏం చేస్తే బాగుంటుందో డిసెంబరులోగా నివేదిక ఇవ్వండి . ప్రతీ మండలాన్ని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ప్రణాళిక సిద్ధం చేయండి ' అని సీఎం చెప్పారు. 'ప్రతీ పేదవాడికి విద్యతోపాటు వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలి. నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందిచడమే లక్ష్యంగా పనిచేయాలి . ఏ ఆస్తులు లేకపోయినా చదువుకొని ఉద్యోగాలు సాధించిన వారు ప్రపంచంతో పోటీ పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయం పెంచడం, పేదలకు పంచడమే మా ప్రభుత్వ లక్ష్యం . ఒక్కో విద్యారి?థపై ప్రభుత్వం రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోంది . ప్రైవేటు స్కూల్ పిల్లలకు వారి తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు దాదాపు రూ.50 వేలు. ప్రభుత్వం ఎంతో వెచ్చిస్తున్నా తల్లిదండ్రులు ప్రైవేటు బడులకు ఎందుకు ప్రాధాన్యతనిస్తున్నారో ఒకసారి ఆలోచించాలి ' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి 2014 వరకు ప్రధానులుగా ఉన్నవాళ్లు చేసిన మొత్తం అప్పు రూ.50 లక్షల కోట్లు అని సీఎం రేవంత్ అన్నారు. 2014 నుంచి 2026 వరకు ప్రధాని మోదీ చేసిన అప్పు రూ.151 లక్షల కోట్లు అని చెప్పారు. ఇప్పటి వరకు దేశంపై ఉన్న అప్పు రూ.201 లక్షల కోట్లు అని పేర్కొన్నారు. కొందరు చిన్న చిన్న సంఘటనలు చూపి గొప్ప గొప్ప విజయాలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.



# యాదాద్రీశుడిని దర్శించుకున్న వానమామలై జియర్ స్వామి

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన వేద పండితులు
- శ్రీలక్ష్మీనరసింహునికి బంగారు పుష్పాలతో అర్చన

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం వానమాముల పీఠాధిపతి శ్రీ మధురకవి వానమామలై జియర్ స్వామి పర్యటించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న పీఠాధిపతికి ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ముఖద్వారం గుండా ప్రవేశించిన ఆయన బలిపీఠం, ధ్వజస్తంభాలకు ప్రదక్షిణలు గావించారు. గర్భాలయంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి అమ్మవార్లకు బంగారు పుష్పాలతో సువర్ణ పుష్పార్చన పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతికి ఆలయ అధికారులు పుష్పాలు, పండ్లను సమర్పించి ఆలయ మర్యాదలతో సత్కరించగా, ఆయన కూడా అర్చకులకు పండ్లు, పుష్పాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో భవానీ శంకర్, ఆలయ ప్రధాన అర్చకులు కాండూరు వేంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, కిరణ్ కుమార్ ఆచార్యులు, మాధవాచార్యులు, శ్రీనాథ ఆచార్యులు, ఆలయ అధికారులు సురేందర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలి

- యాదగిరిగుట్ట సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్
- వివిధ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో ప్రత్యేక సమీక్షా సమావేశం




**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** ప్రతి పోలీస్ స్టేషన్ ప్రజలకు నమ్మకమైన సేవా కేంద్రంగా నిలవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం యాదగిరిగుట్ట సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, పరిపాలనా విధానాలు, నేరాల నమోదు, దర్యాప్తు పురోగతితో పాటు వివిధ రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని తుర్కపల్లి, రాజాపేట, మోటకొండూరు, గుండాల పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రాత్రి గస్తీ, బీట్ వ్యవస్థ, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జోన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్, వివిధ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

- రాజాపేటలో మొక్కలు పంపిణీ చేసిన సర్పంచి కోయ మధు
- హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

**తొలివెలుగు, రాజాపేట:** నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను గ్రామస్థులంతా తీసుకోవాలని సర్పంచి కోయ మధు అన్నారు. రాజాపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గురువారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీతో పాటు మధిర గ్రామమైన బంటుగూడెంలో నివసించే ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఆయన పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ తమ నివాసాల వద్ద మొక్కలు నాటి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, మాజీ పాల సొసైటీ చైర్మన్ గాండ్ల నర్సింగరావు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలి

- బీజేపీ ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ సమావేశంలో పాశం భాస్కర్
- వలిగొండ, లోతుకుంట గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

**తొలివెలుగు, వలిగొండ:** భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత బలపడాలంటే ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. వలిగొండ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ అధ్యక్షతన ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్ నిమిత్తం శక్తి కేంద్రాల ప్రభారీలు, మండల పదాధికారుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పాశం భాస్కర్ మాట్లాడుతూ... బలమైన సంస్థాగత వ్యవస్థే పార్టీ విజయాలకు ప్రధాన పునాది అని పేర్కొన్నారు. సమావేశం అనంతరం శక్తి కేంద్రాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష జరిపారు. బిఎల్ఏ-2లతో కలిసి వలిగొండ పట్టణం, లోతుకుంట గ్రామాల్లో సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నేరుగా పరిశీలించారు. పిఎల్ఓలు నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, బిఎల్ఏలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ అసెంబ్లీ కో-కన్వీనర్ రాచకొండ కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు మైసొల్ల రామనర్సు, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, కనతాల అశోక్‌రెడ్డి, కందుల తానేష్, మంద నరసింహ, బంధారపు రాములు, రావుల పద్మారెడ్డి, పాక పుల్లయ్య, బొడిగే ఆనంద్, బచ్చు శ్రీనివాస్, మండల పదాధికారులు మందడి రంజిత్‌రెడ్డి, లోడే లింగస్వామి గౌడ్, గంగాధర్ దయాకర్, ఎదురుగట్ల వెంకటేశం, శ్రీనివాస్, గోగు మహేష్, వార్డు సభ్యులు దంతూరి అరుణ్, వీరాచారి, బుంగమట్ల మహేష్, మైసొల్ల చిన్న మచ్చగిరి, దయ్యాల వెంకటేష్, ఎర్రవోలు జంగయ్యతో పాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# అంగన్‌వాడీ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు





- సామ్, మామ్ చిన్నారులను పీహెచ్‌సీలకు తరలించి వైద్యం అందించాలి
- బాల్య వివాహాల నివారణకు గ్రామ, మండల కమిటీలు బలోపేతం చేయాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి విస్తృత సమీక్ష

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** "అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకం చివరి లబ్ధిదారునికి సక్రమంగా అందాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదు" అని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఐసీపీఎస్ సిబ్బందితో కలెక్టర్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తీవ్ర పోషకాహార లోపం (సామ్), మోస్తరు పోషకాహార లోపం (మామ్) ఉన్న చిన్నారులను గుర్తించి, వారి వివరాలను ప్రతీ కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల బరువు, ఎత్తు కొలతలను పక్కాగా నమోదు చేయాలని, బాధితులను వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీ) తీసుకెళ్లి ఉచితంగా చికిత్స అందింపజేయాలని ఆదేశించారు. తీవ్ర రక్తహీనత కలిగిన గర్భిణుల ఆరోగ్యంపై సూపర్‌వైజర్లు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బాల్య వివాహాల అడ్డుకట్టకు బాలల పరిరక్షణ కమిటీలు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ... నిర్మాణంలో ఉన్న సఖి కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల పనులను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీడీపీఓలు శైలజ, వెంకటరమణ, స్వరాజ్యం, నాజీ, అనంతలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.





# విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలి

- కేజీబీవీ, యూనిఫామ్ కుట్టు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- 2 నిర్ణీత గడువులోగా పాఠశాల దుస్తులు పంపిణీ చేయాలి

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/ భూదాన్ పోచంపల్లి:** పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. పోచంపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను (కేజీబీవీ) గురువారం ఆయన సందర్శించి, మధ్యాహ్న భోజన అమలు తీరును నిశితంగా పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో సాగుతున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను తనిఖీ చేశారు. పాఠశాలలో అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందుతుందా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంటగది నిర్వహణ, తాగునీటి సదుపాయం, వంటశాల పరిశుభ్రతను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటించి ఆహారం రుచి, నాణ్యత గురించి సమాచారం సేకరించారు. అనంతరం యూనిఫాం కుట్టు కేంద్రంలో మాట్లాడుతూ... మరింత మంది దర్జీలను (టైలర్లను) ఏర్పాటు చేసి కుట్టు పనులను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



- లక్షణాలుంటే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి
- ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలి: వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్

**తొలివెలుగు, రాజాపేట:** వర్షాకాలం దృష్ట్యా వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని రాజాపేట ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం నివాస ప్రాంగణాల్లో 'డ్రై డే' పాటించి, నిల్వ నీరు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రాజాపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన మందులను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, కాచి చల్లార్చిన స్వచ్ఛమైన నీటిని తాగడం ద్వారా వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన తెలిపారు.

# రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా రాజు

- ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం
- డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల రేషన్ డీలర్ల సంఘం నూతన అధ్యక్షుడిగా రాజాపేట-1 డీలర్ సోమసాని రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా రేణికుంట గంధమల్ల విజయలక్ష్మి, కోశాధికారిగా రాజాపేట-2 డీలర్ నంగునూరి రాజేశ్వర్, గౌరవాధ్యక్షుడిగా రఘునాథపురం డీలర్ కలకుంట్ల పోచయ్యలు ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను చేనేత శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సోమసాని రాజు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డీలర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం

- అంగన్వాడీ సెక్టార్ సమావేశంలో సూపర్వైజర్ కవిత
- కేంద్రాల రికార్డుల నిశిత పరిశీలన

**తొలివెలుగు, చిన్నగూడూరు:** ప్రభుత్వం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యతతో అందించాలని చిన్నగూడూరు అంగన్వాడీ సెక్టార్ సూపర్వైజర్ కవిత సూచించారు. మండల కేంద్రంలో గురువారం చిన్నగూడూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల రికార్డులను, లబ్ధిదారులకు అందిస్తున్న పోషకాహార వితరణ వివరాలను ఆమె నిశితంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉండాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



# 'జలసిరి' పనులను వేగవంతం చేయాలి




- ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- రామన్నపేట మండల సమీక్షలో జెడ్పీ సీఈఓ శోభారాణి

**తొలివెలుగు, రామన్నపేట:** కరువు పరిస్థితులను అధిగమించేందుకు 'జలసిరి' కార్యక్రమాన్ని మండలంలో విస్తృతంగా అమలు చేయడంతో పాటు రైతులకు ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) శోభారాణి అధికారులను ఆదేశించారు. రామన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ... భూగర్భ జలమట్ట పెంచుకోవడానికి ప్రతి గ్రామంలో జల సంరక్షణ చర్యలను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతు పొలంలో ఫామ్‌పాండ్ (పత్తి కుంట) మరియు గ్రామంలో ఊట కుంటల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గుచూపేలా సర్పంచులు, అధికారులు క్షేత్రస్థాయిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రాఘవరెడ్డి, ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి, ఎంపీఓ రఫీ, ఏపీఓ వెంకన్న, ఏఐఏ ఏజాజ్ అలీ ఖాన్, ఏపీఎం జానీ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సంఘాల అధ్యక్షులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేల విలువైన టీవీ విరాళం

- డిజిటల్ విద్యతో పెరగనున్న అభ్యాస సామర్థ్యం
- 'హార్ట్‌ఫుల్‌నెస్' సంస్థ, దాత బిక్షపతికి హెచ్‌ఎం కృతజ్ఞతలు



**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్యను అందించే లక్ష్యంతో రామన్నపేట మండలం కక్కిరేణి ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.50 వేల విలువైన 55 అంగుళాల సామ్‌సంగ్ ఎల్‌ఈడీ 4కే టీవీ విరాళంగా సమకూరింది. 'హార్ట్‌ఫుల్‌నెస్' సంస్థ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పారేపల్లి బిక్షపతి తన తండ్రి పారేపల్లి చంద్రయ్య జ్ఞాపకార్థం ఈ టీవీని గురువారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. ఉపేందర్ మాట్లాడుతూ... సాంకేతిక విప్లవ యుగంలో డిజిటల్ పాఠాలు, విద్యా వీడియోలు, సృజనాత్మక బోధన ద్వారా విద్యార్థుల అభ్యాస సామర్థ్యం పెరుగుతుందన్నారు. బడి అభివృద్ధికి సహకరిస్తున్న దాత పారేపల్లి బిక్షపతితో పాటు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల బలోపేతానికి సమాజంలో దాతలు ఇదే స్ఫూర్తితో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్, ఉపసర్పంచ్ నడిగోటి పాండు, ఉపాధ్యాయులు గణేష్, గోపాల్‌రెడ్డి, కృష్ణ, ప్రశాంతి, సంధ్య, పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్, ఏఏపీసీ చైర్మన్ చిల్ల ప్రేమలత మురళీకృష్ణ, గ్రామ పెద్ద మదూరి సోమేశ్వరరావు, సామాజిక కార్యకర్త వేముల సైదులు, చిల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకులకు ప్రభుత్వాలు ఊతమివ్వాలి

- రూ.624 కోట్ల వ్యాపార మార్కును చేరిన పోచంపల్లి అర్బన్ బ్యాంక్
- 53వ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ తడక రమేష్




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** సహకార బ్యాంకింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ కోరారు. పోచంపల్లిలోని బ్యాంక్ కేంద్ర కార్యాలయ ఆవరణలోని కొంగరి భాస్కర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన 53వ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సహాయాన్ని సహకార బ్యాంకుల ద్వారా పంపిణీ చేస్తే ఈ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 21 శాఖల ద్వారా పోచంపల్లి అర్బన్ బ్యాంక్ సుమారు రూ.624 కోట్ల వార్షిక వ్యాపారాన్ని సాధించిందని తెలిపారు. బ్యాంకులో ఇప్పటివరకు రూ.327.26 కోట్ల డిపాజిట్లు నమోదు కాగా, వాటా ధనం రూ.16.89 కోట్లకు చేరిందని వెల్లడించారు. జాతీయ స్థాయిలో ఎన్ఐపి అవార్డులు సాధిస్తూ, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ సీత శ్రీనివాస్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, ఏలే హరి శంకర్, సురపల్లి రమేష్, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్, బ్యాంక్ మేనేజర్ రచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# గౌడ భవనానికి రెండెకరాల స్థలం కేటాయించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్‌కు వినతి
- కలెక్టర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామన్న శాసనసభ్యుడు

**తొలివెలుగు, మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గౌడ భవనం నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఐక్య గౌడ సంఘాల వేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గౌడ సమాజ అభివృద్ధికి, యువతకు శిక్షణ కార్యక్రమాలు, సామాజిక సమావేశాల నిర్వహణకు జిల్లా కేంద్రంలో భవనం ఎంతో అవసరమని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. భవన నిర్మాణ స్థల కేటాయింపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, త్వరలోనే జిల్లా కలెక్టర్‌ను స్వయంగా కలిసి మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు జెర్రిపోతుల వెంకన్న గౌడ్, పెద్ది వెంకన్న గౌడ్, కదిరే సురేందర్ గౌడ్, చిత్తనూరి శ్రీనివాస్, గాడిపల్లి చరణ్ గౌడ్, గండి వీరేందర్ గౌడ్, ముంజాల రాజేందర్ గౌడ్, గుదె వీరన్న గౌడ్, గంధసిరి వేణు గౌడ్, గాడిపల్లి శ్రీహరి, లింగాల వీరభద్రం గౌడ్, బండి దీపక్ గౌడ్, గాడిపల్లి శేఖర్, సీహెచ్ ఉదయ్, ఉమ్మగాని మధు, గడ్డం విజయ్ గౌడ్, గడ్డం సమ్మయ్య గౌడ్, గుదె యుగేందర్ గౌడ్ తదితర గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రజిత

- నియామక పత్రం అందజేసిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత
- బీసీల సంక్షేమం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న కుసుమ రజిత

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేటకు చెందిన కుసుమ రజిత తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆమెకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుసుమ రజిత మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ బీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాజాపేట ప్రాంత మహిళకు రాష్ట్ర స్థాయిలో పదవి దక్కడం పట్ల స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.



## పోచంపల్లి నూతన ఎస్ఐగా జగన్ బాధ్యతల స్వీకారం

- భాస్కర్ రెడ్డికి పోలీసు సిబ్బంది ఘన వీడ్కోలు
- శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరం: ఎస్ఐ జగన్





**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా జే. జగన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టి స్టేషన్ సిబ్బందితో సమావేశమయ్యారు. భువనగిరి జిల్లా సైబర్ క్రైమ్ విభాగంలో విధులు నిర్వహించిన జే. జగన్ బదిలీపై పోచంపల్లికి రాగా, ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన భాస్కర్ రెడ్డి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ జగన్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, పోలీసులతో సమన్వయంతో పనిచేస్తే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎస్ఐ భాస్కర్ రెడ్డికి పోలీసు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు శంకర్ నాయక్, శ్రీనివాస్, రమేష్, యాదగిరి, పోలీసు కానిస్టేబుళ్లు షరీఫ్, శీను గౌడ్, సాయి, వినోద్, స్వామి, ఇస్తారి, మహిళా కానిస్టేబుళ్లు లలిత, సరస్వతి, సోనీ, అంకితతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో బీఎల్ఏలతో కాంగ్రెస్ సమావేశం

- బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యాచరణ
- ఓటరు జాబితా పరిశీలనపై దిశానిర్దేశం చేసిన పరిశీలకులు



**తొలివెలుగు, ఎల్బీనగర్:** సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ పరిశీలకులు కె.ఎల్.ఆర్, పీఏలు రవీందర్, వెంకట్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై బీఎల్ఏలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటరు జాబితా పరిశీలనను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ కార్యక్రమాలను గ్రామాలు, కాలనీల స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ యాదవ్, మహేశ్వరం ఎస్సీ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ శ్రీధర్, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్ యాదవ్, కిషోర్, రంజిత్, భాస్కర్, కళ్యాణ్, అరవింద్, కుమార్, కిట్టు, మల్లి, వెంకటేష్ యాదవ్, నరేందర్ ముదిరాజ్‌తో పాటు బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

- 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు అవకాశం
- ఆగస్టు 3వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డ కాలనీలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో (టీజీఆర్ఎస్) 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి. విజిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థినులు వచ్చే నెల (ఆగస్టు) 3వ తేదీ సాయంత్రం లోగా పూర్తి చేసిన దరఖాస్తులను చౌటుప్పల్ బంగారుగడ్డ కాలనీలోని గురుకుల పాఠశాల/కళాశాలలో నేరుగా అందజేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు విద్యార్థిని ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, బోనఫైడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు.

**ఆగస్టు 5న ప్రవేశ పరీక్ష:**

దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు ఆగస్టు 5వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సర్వేల్‌లోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాల కేంద్రంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండల పరిధిలోని పోచంపల్లి నుంచి ఇంద్రియాల వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రయాణికులకు నరకయాతనగా మారింది. రేపనపల్లి గ్రామం నుంచి శివరెడ్డిగూడెం మీదుగా ఇంద్రియాల వరకు ఉన్న ఈ రహదారి అడుగడుగునా భారీ గుంతలతో దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి పరిస్థితి మరింత దారుణంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా రహదారిపై ఉన్న గుంతలు నీటితో నిండిపోయి చిన్న చిన్న చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**గుంతలే రహదారిగా మారిన పరిస్థితి:**

ఒకప్పుడు సాఫీగా ప్రయాణం సాగిన ఈ రహదారి ప్రస్తుతం గుంతలతో నిండిపోయి వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకుండా పోయింది. రహదారిపై ఎక్కడ చూసినా పెద్దపెద్ద గోతులు కనిపిస్తుండటంతో వాహనాలను నెమ్మదిగా నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వర్షపు నీరు గుంతల్లో నిలిచిపోవడంతో గోతుల లోతు అంచనా వేయలేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

**ప్రతి రోజు ప్రాణాలతో చెలగాటమే:**

ఈ రహదారిపై నిత్యం వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, వ్యవసాయ వాహనాలు, పాఠశాల బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షపు నీరు గుంతలను కప్పేయడంతో ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి కిందపడుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆటోలు అదుపుతప్పడం, వాహనాల సస్పెన్షన్లు దెబ్బతినడం, ప్రయాణికులు గాయపడడం నిత్యకృత్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రి వేళల్లో మరింత ప్రమాదకరం:**

రాత్రి సమయంలో ఈ రహదారిపై ప్రయాణం చేయడం మరింత సాహసంగా మారింది. తగినంత వీధి దీపాలు లేకపోవడం, గుంతలు నీటితో నిండిపోవడంతో వాటి లోతు కనిపించక వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

**రైతులు, విద్యార్థులకు ఇబ్బందులు:**


ఈ రహదారిపై ఆధారపడి రేపనపల్లి, శివరెడ్డిగూడెం, ఇంద్రియాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తున్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు కూడా ప్రతి రోజు ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**వినతులు ఇచ్చినా స్పందన లేదు:**

రహదారి దుస్థితిపై పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు ఇచ్చిన నాయకులు, ఎన్నికల అనంతరం ఈ రహదారి సమస్యను పూర్తిగా విస్మరించారని విమర్శిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అంటున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్:**

తాత్కాలిక మరమ్మతులతో కాకుండా పోచంపల్లి-ఇంద్రియాల ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నాణ్యమైన బీటీ రహదారి నిర్మించి ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేసి రహదారి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని శివరెడ్డిగూడెం, రేపనపల్లి, ఇంద్రియాల గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారి మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రమాదకర గుంతలను తక్షణమే పూడ్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని వారు కోరుతున్నారు.



## చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- రోగులకు మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించాలి
- 100 పడకల ఆసుపత్రి భవన పనులను త్వరగా పూర్తి చేయాలి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. రాత్రి వేళ ఆసుపత్రికి చేరుకున్న ఆయన, అక్కడి పరిసరాలను, వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బందితో పాటు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

**100 పడకల ఆసుపత్రి పనుల పరిశీలన:**



అనంతరం చౌటుప్పల్‌లో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణం చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలి ఉన్న అంతర్గత రోడ్ల నిర్మాణం, పరిసరాల శుభ్రత తదితర పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రిని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు మహమ్మద్ హన్ను, దేప రమ్య రాజు, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, ఆసుపత్రి వైద్యాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కూచిపూడి జన్మస్థానంలో చౌటుప్పల్ చిన్నారుల నాట్య మయూరం!

- గురు పౌర్ణమి పురస్కరించుకుని శిల్పారామంలో 'వారాహి' స్టూడియో ప్రదర్శన
- అభినందించిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్
- తొలిసారిగా కూచిపూడి క్షేత్రంలో ప్రదర్శన ఇచ్చి చౌటుప్పల్ కీర్తిని పెంచిన చిన్నారులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** కూచిపూడి నృత్య కళకు పురిటిగడ్డయిన కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో చౌటుప్పల్ పట్టణానికి చెందిన చిన్నారులు తమ నాట్య విన్యాసాలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూచిపూడి గ్రామంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేదికపై చౌటుప్పల్ రత్నానగర్‌కు చెందిన 'వారాహి డాన్స్ స్టూడియో' (రిజిష్టర్ నంబర్: 321) విద్యార్థినులు అత్యద్భుత నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ చిన్నారుల అభినయాన్ని, నాట్య రీతులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూచిపూడి నృత్య కళను భావితరాలకు అందిస్తూ చిన్నతనంలోనే పిల్లలకు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇప్పించడం అభినందనీయమన్నారు.

**చౌటుప్పల్ చరిత్రలో తొలిసారి:**

చౌటుప్పల్ పట్టణ చరిత్రలోనే తొలిసారిగా స్థానిక చిన్నారులు కూచిపూడి నృత్యానికి జన్మస్థానమైన కూచిపూడి గ్రామానికి వెళ్లి అక్కడ ప్రదర్శన ఇవ్వడం పట్ల స్థానికులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారాహి డాన్స్ స్టూడియో డైరెక్టర్ ఎడ్ల హిమబిందు, నాట్య గురువు మౌనికల సమర్థవంతమైన శిక్షణ వల్లే తమ పిల్లలు ఈ స్థాయి ప్రదర్శన ఇవ్వగలిగారని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. అంతటి చారిత్రక క్షేత్రంలో తమ ప్రతిభను చాటి చౌటుప్పల్ పట్టణానికి గొప్ప పేరు ప్రఖ్యాతలు తెచ్చిన చిన్నారులను, వారి గురువులను పలువురు ప్రముఖులు అభినందించారు.

# నిధుల మళ్లింపులో లీలలెన్నో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో అక్రమాల పుట్ట బద్దలైంది. ప్రజాధనానికి రక్షణగా ఉండాల్సిన ఆర్థిక విభాగమే అక్రమారులకు కొమ్ముకాస్తూ కోట్ల రూపాయల గోల్ మాల్ కు తెరలేపిన ఘటన తీవ్ర సంచలనం సృష్టిస్తున్నది. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమై రెండేళ్లుగా బిల్లులు కోసం ఒకవైపు..మరోవైపు క్షేత్రస్థాయిలో చెమటోడ్చి పని చేసిన కాంట్రాక్టర్‌కు పైసలు చెల్లించకుండా ముప్పు తిప్పలు పెడుతున్న అధికారులు .. రూల్స్ కు విరుద్ధంగా వేరొకరి ఖాతాల్లోకి నిధులు మళ్లించిన వైనం జీహెచ్ఎంసీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఒకే పనికి రెండుసార్లు (డబుల్ బిల్స్) చెల్లింపులు చేస్తూ ప్రభుత్వ ఖజానాను గుల్ల చేశారు. దాదాపు 90 మంది కాంట్రాక్టర్లకు డబుల్ బిల్లులు చెల్లించడం, రూ.కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన తీరు వెలుగులోకి రావడంతో కమిషనర్ కర్ణన్ ఈ భారీ నిధుల మళ్లింపు వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. అక్రమాలపై సమగ్ర వివరాలతో కూడిన విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ డబుల్ పేమెంట్లు పొందిన కాంట్రాక్టర్లను పిలిచిపించుకుని నగదును రికవరీ చేసే పనిలో ఉన్నారు. దీంతో పాటు నిధుల మళ్లింపులో కీలకమైన చీఫ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ చంద్ర లాగిన్ కట్ చేశారు. ఈ స్కాంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కంప్యూటర్ ఆపరేటర్‌తో కలిసి ముసారాంబాగ్ ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌ను విజిలెన్స్ దృష్టి సారించింది. డబుల్ బిల్లులు పొందిన ఫైళ్లను, సిఫారసు లేటర్లు, డిజిటల్ సంతకాల ఐడీలను సీజ్ చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. డబుల్ బిల్లుల చెల్లింపుల అంశంలో జీహెచ్ఎంసీ ఆర్థిక విభాగం లీలలు ఒక్కొక్కటీగా వెలుగులోకి వస్తున్నాయి. క్లాస్ -5 (ఐదో గ్రేడ్) కాంట్రాటర్‌కు సంబంధించి చెల్లించాల్సిన బిల్లు రూ.19 లక్షలు ఉంటే జీఎస్టీ ఫోర్టల్‌లో 2 శాతం చెల్లించాల్సిన చోట కాంట్రాక్టరు పేరిట 1.20 కోట్లకు జీఎస్టీ బిల్లు జనరేట్ చేశారు. దీంతో సదరు కాంట్రాక్టరుకు మిగతా 16 శాతం జీఎస్టీ కట్టాలంటూ నోటీసులు అందుకోవడం గమనార్హం. మరో కాంట్రాక్టర్‌కు సంబంధించిన ఏసీ బిల్లును మరో ఏజెన్సీ ఖాతాలో క్రెడిట్ చేశారు. బిల్లు రానీ క్ష?ంర టాక్టర్ ఈఆర్పీని ఏకంగా బ్లాక్ చేయడం మరో వింత. ఒక కాంట్రాక్టర్‌కు ఎం.బుక్ ద్వారా రూ. 5,000 రావాలన్నా సంబంధిత హెచ్‌ఓడీ, ఏఈ, డీఈ ల చుట్టూ తిరుగుతూ సంతకాలు, తనిఖీలు చేయించుకోవాలని నిబంధనలు పెట్టే అధికారులు..అడ్డగోలుగా బిల్లులు మంజూరు చేయడంలో బాధ్యులైన అధికారులపై కఠినంగా వ్యవహరించాలని అడహక్ కాం ట్రాక్టర్లు చేస్తున్నారు. ప్రభుత్వ బిల్లులు, డబుల్ పేమెంట్ల వ్యవహారంలో అధికారులు చేసిన తప్పులను తమపై రుద్దాలని చూస్తున్నట్లు కాంట్రాక్టర్ల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంట్రాక్టర్లు ఎవరూ డబుల్ పేమెంట్ కావాలని అడగలేదని, బిల్లుల పరిశీలనలో అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయని స్పష్టం చేసిం ది. ఒక కాగితం తకువ ఉన్నా ముందు కు సాగని ఆడిట్ ప్రక్రియలో.. డబుల్ పేమెంట్లు ఎలా జరిగాయో అధికారులే జవాబు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. సొంత తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కాంట్రాక్టర్లను బలిపశువులను చేయడం సరికాద ని మండిపడ్డారు. ఈ అంశంపై త్వరలోనే మున్సిపల్ కమిషనర్ కలిసేందుకు సిద్ధమయ్యారు.

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యంపై కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జడ్సీ రాధికా గుప్తా తీరును వ్యతిరేకిస్తూ గురువారం అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో ఎంఎంసీ ప్రధాన కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. పలుమార్లు అధికారులను కలిసి వినతులు అందజేసినా సమ స్య పరిషారం కాకపోవడంతో కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించి ఈ కార్యక్రమం చేపట్టినట్లు భాస్కర్ పేర్కొన్నారు.

# భర్త హయాంలోనూ.. భార్య హయాంలోనూ అదే దుస్థితి!

- పోనకల్ టౌన్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కరువు
- వర్షం పడితే చాలు.. మురుగు నీటిలోనే ప్రజల రాకపోకలు
- వ్యాపారులు, స్థానికుల ఆవేదన.. దుర్వాసనతో ప్రజారోగ్యానికి ముప్పు
- ఏళ్లుగా వినతులు ఇచ్చినా స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

**తొలి వెలుగు, జన్నారం:** మండల పరిధిలోని పోనకల్ టౌన్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారులు మురుగు నీటితో నిండిపోతుండటంతో ప్రజలు అడుగు బయటపెట్టాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. దుకాణాల ముందు మురుగు నీరు నిలిచిపోవడంతో వ్యాపారాలు దెబ్బతింటుండగా, స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గత ఐదేళ్లపాటు భర్త సర్పంచ్‌గా కొనసాగిన సమయంలో కూడా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. ప్రస్తుతం భార్య సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు మారినా ప్రజల కష్టాలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని విమర్శిస్తున్నారు. వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. స్థానిక వ్యాపారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాల ముందు నిలిచిపోయే మురుగు నీటి కారణంగా వినియోగదారులు రావడానికి ఇబ్బంది పడుతుండటంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వారు వాపోతున్నారు. మురుగు నీటిని దాటుకుంటూ దుకాణాల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో వినియోగదారులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నారు.





**సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు**

"పోనకల్ టౌన్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్లన్నీ మురుగు నీటితో నిండిపోతున్నాయి. దుర్వాసన, దోమల బెడదతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి."

కొత్త శ్రీనివాస్ గుప్తా, స్థానికుడు



**డ్రైనేజీ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.**

"గతంలో భర్త సర్పంచ్‌గా, ప్రస్తుతం భార్య సర్పంచ్‌గా ఉన్నప్పటికీ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. ప్రజలు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి టౌన్‌లో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి." స్థానికులు పలుమార్లు గ్రామపంచాయతీ, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇకనైనా ప్రత్యేక నిధులు కేటాయించి పోనకల్ టౌన్‌లో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వ్యాపారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బీఆర్ఎస్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్

# ఆసుపత్రుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి



- పేద ప్రజల ఆరోగ్యానికే ప్రభుత్వ ప్రాధాన్యం: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- చౌటుప్పల్‌లో 'ట్రామా కేర్ సెంటర్' ఏర్పాటు అత్యంత అవసరం

**తొలివెలుగు, మునుగోడు:** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సబ్‌సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), సీహెచ్‌సీలు మరియు ఏరియా ఆసుపత్రులను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది, సాంకేతిక పరికరాలు, నిధుల వివరాలతో కూడిన సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల వైద్యాధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రైవేట్ ఆస్పత్రుల్లో భారీ బిల్లులు చెల్లించలేక పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకే ప్రజా వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మునుగోడు, నాంపల్లి పీహెచ్‌సీలను ఆధునికీకరించి 30 పడకల ఆసుపత్రులుగా విస్తరించాలని, మర్రిగూడ సీహెచ్‌సీని 30 నుంచి 50 పడకలకు పెంచి పోస్టుమార్టం గది, అవసరమైన సిబ్బందిని నియమించేలా అంచనాలు రూపొందించాలన్నారు. చండూరు రెవిన్యూ కేంద్రంలో 100 పడకల ఏరియా ఆసుపత్రి మంజూరు, నిర్మాణం, గట్టుప్పల్ పీహెచ్‌సీకి సిబ్బంది సదుపాయంపై ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

**ఎన్‌హెచ్-65పై అత్యవసర వైద్యం:**

జాతీయ రహదారి 65పై ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను 'గోల్డెన్ అవర్'లో హైదరాబాద్‌కు తరలించలేక మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారని, చౌటుప్పల్ ప్రాంతంలో అత్యవసర చికిత్స కోసం 'ట్రామా కేర్ సెంటర్'ను వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే చౌటుప్పల్‌లోని 100 పడకల ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆసుపత్రుల బడ్జెట్ పెంపు అంశాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. డాక్టర్లు పూర్తి బాధ్యతతో, కమిట్‌మెంట్‌తో పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నల్గొండ డిఎంహెచ్ఓ రాహుల్, డిసిహెచ్ మాతృనాయక్, యాదాద్రి భువనగిరి డిఎంహెచ్ఓ మనోహర్, డిసిహెచ్ సూర్యశ్రీ, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయ పరిసరాల్లో లేజర్‌బీమ్ లైట్లు వాడొద్దు



శంషాబాద్ రూరల్, జూలై 30: విమానాల రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ అదనపు కమిషనర్ తఫ్సిర్ ఇక్బాల్ ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చుట్టూ ఉన్న ఫంక్షన్‌హాల్స్, ఫాంహౌజ్‌లకు చెందిన యజమానులకు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ తఫ్సిర్ ఇక్బాల్ మాట్లాడుతూ శంషాబాద్ విమానాశ్రయం చుట్టూ లేజర్‌బీమ్ లైట్లు, స్కైబీమ్ లైట్లు, సెర్చ్ లైట్లు, మూవింగ్ బీమ్ లైట్లు ఇతర తీవ్రత గల కాంతి పరికరాల వినియోగాన్ని నిషేధించాలని సూచించారు. లేజర్ లైట్లతో విమానాలకు టేకాఫ్, అప్రోచ్, ల్యాండింగ్ ప్రక్రియలకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

## కొత్తవారికి అప్పు పుట్టట్లేదు..

**పాత ఖాతాదారులకే రుణాలిచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి: టీయూ సిబిల్**

ముంబై, జూలై 30: కొత్తగా రుణాలు తీసుకోవాలనుకొనేవారిపట్ల గతంతో పోల్చితే బ్యాంకులు ఇప్పుడు అంతగా ఆసక్తి చూపట్లేదని, పాత కస్టమర్ల వైపే మొగ్గు చూపుతున్నాయని ప్రముఖ క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ ట్రాన్స్‌యూనియన్ (టీయూ) సిబిల్ చెప్తున్నది. సిబిల్ తాజా డాటా ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2025-26) కొత్త రుణగ్రహీతలు అన్ని రుణాల్లో కలిపి 13 శాతంగానే ఉన్నారు. అయితే పదేండ్ల క్రితం (2016-17) ఇది 32 శాతంగా ఉన్నట్టు గురువారం సిబిల్ వెల్లడించింది. చిరు వ్యాపారులకు రుణాల విషయంలోనూ కొత్త రుణగ్రహీతల వాటా 60 శాతం నుంచి 39 శాతానికి పడిపోయినట్టు చెప్పింది. నిజానికి దేశంలో రుణ అర్హత కలిగినవారు 2017 మార్చిలో 79 కోట్లుగా ఉంటే.. 2026 మార్చిలో 89 కోట్లకు పెరిగారని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆ స్థాయిలో నూతన రుణగ్రహీతలు పెరుగలేదని చెప్పడం గమనార్హం. ప్రైవేట్ రంగ బ్యాంకులు కొత్తగా అప్పులు తీసుకోవాలనుకొనేవారికి పెద్దగా అవకాశం ఇవ్వడం లేదని ఈ సందర్భంగా టీయూ సిబిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఎండీ భవేశ్ జైన్ అన్నారు. ఎక్కువమంది ప్రభుత్వ రంగ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోనే రుణాలు పొందుతున్నారని చెప్పారు. అయితే ఎగవేత భయాలు లేదా క్రెడిట్ పాలసీలు కొత్తవారి రుణాల మంజూరులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్న జైన్.. పాత రుణగ్రహీతలతో పోల్చితే కొత్తవారి నుంచి రుణాల వసూళ్లు ఇబ్బందికరంగా మారడమూ ఈ పరిస్థితికి కారణమేనన్నారు. కరోనాకు ముందు ద్విచక్ర వాహనాల కొనుగోలు కోసం ఎక్కువమంది రుణాలపై ఆధారపడేవారని, ఇప్పుడు ఆ స్థానంలో మొబైల్ ఫోన్ వచ్చిందని జైన్ తెలిపారు. అలాగే మొబైల్ ఫోన్ల కొనుగోలు కోసం తీసుకుంటున్న సగటు రుణం విలువ రూ.35,000పైనేనని, ఎక్కువగా ఎన్‌బీఎఫ్‌సీల్లో పొందుతున్నారని చెప్పారు.




## అమెజాన్ గ్రేట్ ఫ్రీడమ్ సేల్ 2026: డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ వివరాలు ఇవే



ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారికి కోసం అమెజాన్ ఆగస్టు 7వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి గ్రేట్ ఫ్రీడమ్ సేల్ 2026 ప్రారంభించనుంది. ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, బ్యూటీ ఉత్పత్తులు, హోమ్ అప్లయెన్సెస్, కిచెన్ వస్తువులు, గ్రాసరీ వంటి ఎన్నో విభాగాల్లో ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. సారి సేల్‌లో కస్టమర్ల కోసం టాప్ 100 డీల్స్, బ్లాక్‌బస్టర్ డీల్స్, ట్రెండింగ్ డీల్స్, 8 పీఎం డీల్స్ వంటి ప్రత్యేక ఆఫర్లను అమెజాన్ తీసుకొస్తోంది. దీంతో పాటు.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం తక్షణ డిస్కౌంట్ అందిస్తుంది. అంతే కాకుండా.. ఎంపిక చేసిన క్రెడిట్, డెబిట్ కార్డులపై నో-కాస్ట్ ఈఎంఐ సదుపాయంతో పాటు రూ.2,000 వరకు క్యాష్‌బ్యాక్ రివార్డ్స్ పొందే సదుపాయం కూడా ఉంది. డిస్కౌంట్లతో పాటు కస్టమర్లకు మరిన్ని ప్రయోజనాలు అందించేందుకు అమెజాన్ పలు ఆఫర్లను ప్రకటించింది. ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, బ్యాంక్ డిస్కౌంట్లు, అమెజాన్ పే రివార్డ్స్ ద్వారా కొనుగోళ్లను మరింత చౌకగా మార్చుకునే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న పిన్‌కోడ్లలో వేగవంతమైన డెలివరీ సదుపాయం కల్పించనున్నట్లు అమెజాన్ తెలిపింది. ఈసారి అమెజాన్ సేల్‌లో ఏఐ ఫీచర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కస్టమర్లకు సరైన ఉత్పత్తిని కనుగొనడంలో సహాయపడేందుకు రూఫస్ ఏఐ షాపింగ్ అసిస్టెంట్ అందుబాటులో ఉంటుంది. కస్టమర్లు తమకు కావాల్సిన వస్తువు గురించి సాధారణ భాషలో అడిగితే, దానికి సరిపోయే ఉత్పత్తులను రూఫస్ సూచిస్తుంది. లెన్స్ ఏఐ ద్వారా ఫొటో తీసి లేదా అప్‌లోడ్ చేసి నచ్చిన వస్తువులను సులభంగా వెతకవచ్చు. ఒక ఉత్పత్తి ధర ఎప్పుడు తగ్గిందో తెలుసుకునేందుకు 30 నుంచి 90 రోజుల ప్రైస్ హిస్టరీ ట్రాకర్ సదుపాయం కూడా ఉంటుంది. ధర మనకు అనుకూలంగా మారినప్పుడు కొనుగోలు చేయడానికి అలర్ట్స్ పంపుతుంది. ఒక వస్తువు కొనుగోలు చేసే ముందు రివ్యూలు చదవడం చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. దీనిని సులభతరం చేసేందుకు ఏఐ రివ్యూ హైలైట్స్ ఫీచర్ ద్వారా ముఖ్యమైన అంశాలను సంక్షిప్తంగా చూపిస్తుంది. దీంతో కస్టమర్లు సరైన నిర్ణయం తీసుకోవడం మరింత సులభం అవుతుంది. అమెజాన్ పే ఉపయోగించే వారికి కూడా ప్రత్యేక ప్రయోజనాలు అందుబాటులో ఉంటాయి. అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ ఉన్న ప్రైమ్ సభ్యులు 5 శాతం, ఇతర సభ్యులు 3 శాతం వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. అర్హత ఉన్న వినియోగదారులు అమెజాన్ పే లేటర్ ద్వారా రూ.60,000 వరకు క్రెడిట్ సదుపాయం పొందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, అప్లయెన్సెస్ వంటి ఉత్పత్తులను సులభమైన ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు చేయవచ్చు. రూ.1,500 కంటే ఎక్కువ విలువైన కొనుగోళ్లను మూడు నెలల పాటు వడ్డీ లేకుండా విడతలుగా చెల్లించే సదుపాయం కూడా ఉంది.

## 5జీ, బ్రాడ్‌బ్యాండ్ సేవలు.. జియో టాప్!

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రిలయన్స్ జియో తన మార్కెట్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకుంది. జూన్ 2026కు సంబంధించిన భారత టెలికాం నియంత్రణ సంస్థ (ు=ూ×) విడుదల చేసిన తాజా సబ్‌స్క్రైబర్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. తాజా గణాంకాల ప్రకారం.. వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్, 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఖీఔూ), అలాగే యాక్టివ్ వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల పెరుగుదలలో జియో అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. తదుపరి తరం డిజిటల్ కనెక్టివిటీ సేవలపై వినియోగదారుల విశ్వాసం, ఆదరణ నిరంతరం పెరుగుతోందనడానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

జూన్ నెలాఖరు నాటికి జియో మొత్తం వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 3.26 కోట్లకు చేరుకుంది. దీంతో కంపెనీ 36.9 శాతం మార్కెట్ వాటాను నమోదు చేసింది. ఒక్క జూన్ నెలలోనే 1,78,546 నికర వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు జియో నెట్‌వర్క్‌లో చేరారు. వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్ సేవల్లోనూ జియో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 42.7 శాతం మార్కెట్ వాటాతో రాష్ట్రంలో అతిపెద్ద వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్ సేవల సంస్థగా కొనసాగుతోంది. జూన్ నెలలో 28,267 కొత్త కనెక్షన్లు జోడించడంతో మొత్తం వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 21 లక్షలకు చేరుకుంది. వేగంగా విస్తరిస్తున్న హోమ్ బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో జియో తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఖీఔూ) సేవల్లోనూ జియో తన అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ు=ూ× గణాంకాల ప్రకారం, ప్రాంతంలోని 5జీ ఖీఔూ మార్కెట్‌లో జియో 70.5 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. మొత్తం దాదాపు 11 లక్షల మంది ఖీఔూ వినియోగదారుల్లో 7,75,442 మంది జియో సేవలను వినియోగిస్తున్నారు. జూన్ నెలలోనే మరో 8,629 మంది కొత్త ఖీఔూ సబ్‌స్క్రైబర్లు జియోతో అనుసంధానమయ్యారు. అలాగే 5జీ అన్‌లైసెన్స్డ్ బ్యాండ్ రేడియో (ఖదీ=) విభాగంలో సబ్‌స్క్రైబర్లను నమోదు చేస్తున్న ఏకైక టెలికాం ఆపరేటర్గా జియో కొనసాగుతోంది. జూన్ చివరి నాటికి ఈ విభాగంలో జియో సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,18,347కు చేరుకోగా, ఒక్క నెలలోనే 19,799 మంది కొత్త వినియోగదారులు చేరారు. అభివృద్ధి చెందుతున్న ఫిక్స్‌డ్ వైర్‌లెస్ టెక్నాలజీల్లో జియో సాధించిన ముందంజకు ఇది నిదర్శనం. జూన్ 2026 ు=ూ× గణాంకాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో జియో బలమైన పోటీ సామర్థ్యాన్ని మరోసారి రుజువు చేశాయి. వైర్‌లెస్ సేవల్లో నిరంతర వృద్ధిని నమోదు చేస్తూనే, వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ, 5జీ ఆధారిత హోమ్ బ్రాడ్‌బ్యాండ్‌కు పెరుగుతున్న ఆదరణ, యాక్టివ్ వైర్‌లెస్ వినియోగదారులలో అత్యధిక వృద్ధి ద్వారా అధిక విలువ కలిగిన బ్రాడ్‌బ్యాండ్ విభాగాల్లో జియో తన ఆధిపత్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలను నిర్మించడమే కాకుండా, మొబైల్ మరియు ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సేవల్లో వినియోగదారులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించాలన్న జియో సంకల్పాన్ని తాజా ఫలితాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి.






## సంపద సృష్టిలో రోష్ని టాప్

**హురున్ మహిళా సారథుల జాబితాలో...**

న్యూఢిల్లీ, జూలై 30: సంపద సృష్టిలో మహిళా పారిశ్రామికవేత్తలు రాణిస్తున్నారు. దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్నాలజీ చైర్‌పర్సన్ రోష్ని నాడర్ మల్హోత్రా హురున్ ఇండియా మహిళా సారథుల జాబితాలో తొలిస్థానంలో నిలిచారు. మరోవైపు, రూ.5.06 లక్షల కోట్ల విలువైన కంపెనీకి నేతృత్వం వహిస్తున్న హిందుస్థాన్ యూనిలీవర్ సీఈవో, ఎండీ ప్రియా యాన్ ప్రొఫెషనల్ సీఈవోల విభాగంలో అగ్రస్థానంలో ఉన్నారు. 2026 సంవత్సరానికిగాను హురున్ ఇండియా మహిళా సారథుల జాబితా విడుదల చేయగా, దీంట్లో 117 మంది చోటు దక్కించుకున్నారు. అంతక్రితం ఏడాది 97 మంది ఉండగా, ఈసారి 21 శాతం పెరిగారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న వారిలో 12 మంది వృశ్చిక రాశి వారు ఉండటం విశేషం. 2025లో తొమ్మిది విభాగాల్లో మహిళా నాయకత్వంలోని విస్తృత కోణాలను ప్రతిబింబించేలా ఈ జాబితాను రూపొందించగా..ఈసారికిగాను ఈ పరిధిని పన్నెండు విభాగాలకు విస్తరించినట్టు పేర్కొంది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న 117 మంది మహిళా సారథుల మొత్తం విలువ రూ.39 లక్షల కోట్లుగా ఉన్నది. ఇది ఫిన్‌లాండ్ జీడీపీ కంటే అధికంగా ఉండటం విశేషం. ఈ జాబితాలో చోటు దక్కించుకున్నవారిలో సరాసరి వయస్సు 48. అలాగే 19 ఏండ్ల నుంచి 86 ఏండ్లలోపు వారు ఉన్నారు. ఈ జాబితాలో బయోకాన్ ఫౌండర్ కిరణ్ మజుందార్‌షా, నైకా ఫౌండర్ ఫాల్గుని నాయర్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా హురున్ ఇండియా ఫౌండర్, చీఫ్ రిసెర్చర్ అనస్ రహమాన్ జునైద్ మాట్లాడుతూ...దేశీయ ఆర్థిక వ్యవస్థ, సమాజం వైవిధ్యభరితంగా మారుతున్న తరుణంలో గుర్తింపుకోసం వేచి చూస్తూ, తదుపరి తరం మహిళా నాయకులు ఇప్పటికే కృషి చేస్తున్న తక్కువ ప్రాచుర్యం పొందిన రంగాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, అంతగా వెలు

# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

## మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన



బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.



# చెల్లి నిర్మాత...అన్న హీరోగా బరిలోకి
# వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఆ స్టార్ డైరెక్టర్‌తో మరోసారి ..
# హిట్ మూవీకి సీక్వెల్ రానుందా



మంగాత్తా చిత్ర కాంబో రిపీట్ కానుందా? అంటే కోలీవుడ్‌లో అవుననే టాక్ వినిపిస్తోంది. స్టార్ హీరో అజిత్, దర్శకుడు వెంకట్ ప్రభులది హిట్ కాంబినేషన్ అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీరి కాంబోలో 2010లో తెరకెక్కిన మంగాత్తా చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. ఆ చిత్రంలో నటుడు అజిత్‌ను విలనిజంతో కూడిన స్టైలిష్ పాత్రలో చూపించి సక్సెస్ అయ్యారు డైరెక్టర్.దీంతో వీరి కాంబినేషన్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సమయం ఇప్పుడు రానుంది. దర్శకుడు వెంకట్ ప్రభు.. శివకార్తికేయన్ హీరోగా చిత్రం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని నటుడు శివకార్తికేయన్ కూడా తెలిపారు. అయితే ఈ చిత్రం ప్రారంభంలో ఆలస్యం జరగనున్నట్లు తెలిసింది. దీంతో దర్శకుడు వెంకట్ ప్రభు ఇటీవల నటుడు అజిత్‌ను కలిసి కథ వినిపించినట్లు సమాచారం.అది ఆయనకు నచ్చడంలో అందులో నటించడానికి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. కాగా అజిత్ 2027 జనవరి వరకు చిత్రాల్లో నటించనని ఇంతకు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఆయన 64వ చిత్రాన్ని గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం ఫేమ్ ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో నటించనున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో వెంకట్ ప్రభు దర్శకత్వంలో అజిత్ నటించే చిత్రం ఎప్పుడు ప్రారంభం అవుతుంది? దానికి సంబంధించిన వివరాలు ఏమిటి? అన్నది తెలియాలంటే మరికొద్ది కాలం ఆగాల్సిందే. ఇకపోతే ఇది మాంగాత్తాకు సీక్వెల్‌గా ఉంటుందా? లేక కొత్త కథా చిత్రంగా ఉంటుందా? అనే ఆసక్తి నెలకొంది.

# జోడీ కుదిరింది

సల్మాన్ ఖాన్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా రానుందని, ఈ చిత్రాన్ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మించనున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సల్మాన్ ఖాన్ సరసన నయనతార నటించడం దాదాపు ఖరారైయిందని, కథ నచ్చి ఆమె ఒప్పుకున్నారని సమాచారం.ఈ జోడీ గురించి త్వరలోనే అధికారిక ప్రకటన రానుందట. ఇక ఈ సినిమా చిత్రీకరణను ఏప్రిల్ చివర్లో ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని భోగట్టా. మరోవైపు ప్రస్తుతం సల్మాన్ 'మాతృభూమి' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.







# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

## హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో

దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది.

Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com